# మీనాక్షి మేవరిక్స్ టాప్ ప్లేస్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ నాలుగో ఎడిషన్ ఘనంగా ప్రారంభమైంది. ఈ సీజన్‌లో 16 జట్లు నాలుగు గ్రూపుల్లో తలపడుతున్నాయి. ఆదివారం వూటీ గోల్ఫ్ కౌంటీలో జరిగిన తొలి రౌండ్‌లో మీనాక్షి మేవరిక్స్ జట్టు 210 పాయింట్లతో అగ్రస్థానం దక్కించుకుంది. గ్రూప్-డిలో బరిలో దిగిన మేవరిక్స్ జట్టులో నలుగురు గోల్ఫర్లు తలో 36 పాయిం ట్లు సాధించారు. గ్రూప్ దశలో టాప్-8లో నిలిచిన జట్లు క్వార్టర్స్ చేరుతాయి. తుదిపోరు బ్యాంకాక్ వేదికగా నిర్వహించనున్నారు.



*తైక్వాండో ప్రీమియర్ లీగ్ సీజన్-1లో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో హర్యానా హంటర్స్ టీమ్ 36-21, 52-6, 34-10తో మహారాష్ట్ర అవెంజర్స్‌పై విజయం సాధించింది.*

# రన్నరప్ సాత్విక్-చిరాగ్ జోడీ

### ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్



న్యూఢిల్లీ: గత వారం మలేషియా ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి.. ఇండియా ఓపెన్‌లోనూ రెండో స్థానంతోనే సరిపెట్టుకున్నారు. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్-750 పురుషుల డబుల్స్ ఫైనల్లో ఆదివారం సాత్విక్-చిరాగ్ జోడీ 21-15, 11-21, 18-21తో ప్రపంచ చాంపియన్స్ కాంగ్ మిన్-సాంగ్ జాయ్ (కొరియా) ద్వయం చేతిలో ఓటమి పాలైంది. గంటకు పైగా సాగిన పోరులో తొలి గేమ్‌ను సులువుగా గెలుచుకున్న భారత ప్లేయర్లు.. రెండో గేమ్‌ను ప్రత్యర్థికి అప్పగించారు. ఇక హోరాహోరీగా సాగిన మూడో పోరులో కీలక పాయింట్లు సాధించిన కొరియా ప్లేయర్లు టైటిల్ కైవసం చేసుకున్నారు. పాయింట్ పాయింట్‌కు ఆధిక్యం చేతులు మారిన పోరులో సాత్విక్-చిరాగ్ సుదీర్ఘ ర్యాలీలతో ఆకట్టుకోగా.. కొరియా ప్లేయర్లు మన షట్లర్లపై ఆధిపత్యం కొనసాగించారు. గత వారం మలేషియా ఓపెన్ ఫైనల్లోనూ ఈ జోడీ చేతిలోనే భారత్ ద్వయం పరాజయం పాలైంది. 'కొన్నిసార్లు విజయం కంటే ఓటమే మంచి చేస్తుంది. తప్పొప్పులను సమీక్షించు కొని ముందుకు సాగేందుకు ఉపయోగ పడుతుంది' అని తెలుగు ఆటగాడు సాత్విక్ పేర్కొన్నాడు. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో షీ యూ ఛీ, మహిళల సింగిల్స్‌లో తై జూ యింగ్ టైటిల్స్ ఖాతాలో వేసుకున్నారు.



ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్

# సాహో.. సబలెంక

**సీజన్ ఆరంభ గ్రాండ్‌స్లామ్ టోర్నీ.. ఆస్ట్రేలియా ఓపెన్‌లో మహిళల ప్రపంచ రెండో ర్యాంకర్ అరియానా సబలెంక క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టింది. అమెరికా యువ సంచలనం కోకో గాఫ్, క్రెజికోవా కూడా ముందంజ వేయగా.. పురుషుల సిగిల్స్‌లో నంబర్‌వన్ జొకోవిచ్, సిన్నెర్ క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లారు.**

### క్వార్టర్ ఫైనల్ చేరిన నంబర్ 2 ● జొకోవిచ్, గాఫ్ ముందంజ

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో అరియానా సబలెంక క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. ఆదివారం మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో సబలెంక 6-3, 6-2తో అనిసిమోవాపై విజయం సాధించింది. 70 నిమిషాల్లో ముగిసిన పోరులో సబలెంకకు.. అనిసిమోవా ఏ స్థాయిలోనూ పోటీనివ్వలేక వరుస సెట్లలో ఇంటి బాట పట్టింది. ఆరు ఏస్‌లు



కొట్టిన సబలెంక ఒక డబుల్ ఫాల్ట్ చేయగా.. అనిసిమోవా మూడు ఏస్‌లకే పరిమితమైంది. సబలెంక 18 విన్నర్లు కొట్టగా.. 11 విన్నర్లకే పరిమితమైన అనిసిమోవా 21 అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకుంది. మరో మ్యాచ్‌లో నాలుగో సీడ్ కోకో గాఫ్ 6-1, 6-2 ఫ్రెచ్‌పై సునాయస విజయం సాధించింది. క్రెజికోవా 4-6, 6-3, 6-2తో ఆండ్రీవాపై.. కోస్ట్యుక్ 6-2, 6-1తో టిమోఫీవపై గెలుపొందారు. క్వార్టర్స్‌లో కోస్ట్యుక్‌తో గాఫ్, క్రెజికోవాతో సబలెంక అమీతుమీ తెల్చుకోనున్నారు.

**జొకోవిచ్ రికార్డు**

పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ నొవాక్ జొకోవిచ్ రికార్డు స్థాయిలో 58వసారి గ్రాండ్‌స్లామ్ క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టాడు. ఆదివారం జరిగిన ప్రిక్వార్టర్స్‌లో జొకో 6-0. 6-0, 6-3తో అడ్రియన్ మనారినోపై అలవోక విజయం సాధించాడు. ఇప్పటికే 10 సార్లు ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్ గెలిచిన జొకో.. ప్రిక్వార్టర్స్లో 31 విన్నర్లతో ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా చెలరేగిపోయాడు. తద్వారా గ్రాండ్‌స్లామ్‌ల్లో అత్యధికసార్లు (58) క్వార్టర్ ఫైనల్ చేరిన రోజర్ ఫెదరర్‌ను జొకో సమం చేశాడు. గంటా 44 నిమిషాల్లో ముగిసిన పోరులో జొకో 17 ఏస్‌లు కొడితే.. ప్రత్యర్థి కేవలం ఒక్క ఏస్‌కే పరిమితమయ్యాడు. జొకో 15 అనవసర తప్పిదాలకు పాల్పడితే.. మనారినో 31 తప్పిదాలతో మూల్యం చెల్లించుకున్నాడు. క్వార్టర్ ఫైనల్లో 12వ సీడ్ ఫ్రిట్జ్‌తో జొకోవిచ్ తలపడనున్నాడు. ఇతర మ్యాచ్‌ల్లో నాలుగో సీడ్ సిన్నెర్ 6-4, 7-5, 6-3తో కచనోవ్‌పై.. ఐదో సీడ్ రుబ్లెవ్ 6-4, 6-7 (5/7), 6-7 (4/7), 6-3, 6-0తో డి మినార్‌పై.. ఫ్రిట్జ్ 7-6 (7/3), 5-7, 6-3, 6-3తో ఏడో సీడ్ సిట్సిపాస్‌పై విజయం సాధించారు. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో భారత సీనియర్ ప్లేయర్ రోహన్ బోపన్న-మాథ్యూ ఎబ్డెన్ జోడీ సోమవారం ప్రిక్వార్టర్స్ బరిలో దిగనుంది.

## బ్రూక్ స్థానంలో లారెన్స్



బ్రూక్

లండన్: భారత్‌తో ఐదు టెస్టుల సిరీస్ కోసం ఇంగ్లండ్ జట్టుకు ఎంపికైన మిడిలార్డర్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ వ్యక్తిగత కారణాలతో సిరీస్ నుంచి తప్పుకున్నాడు. దీంతో ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు అతడి స్థానంలో డాన్ లారెన్స్‌ను ఎంపిక చేసింది. లారెన్స్ సోమవారం హైదరాబాద్‌లో ఇంగ్లండ్ టీమ్‌తో కలుస్తాడని ఆ దేశ బోర్డు ప్రకటించింది. 'బ్రూక్ సిరీస్ నుంచి అత్యవసర కారణాల వల్ల తప్పుకున్నాడు. అతడి స్థానంలో లారెన్స్‌ను ఎంపిక చేశాం' అని వెల్లడించింది.

## 'బజ్‌బాల్'కు కౌంటర్ 'విరాట్ బాల్': గవాస్కర్



న్యూఢిల్లీ: ఇటీవలి కాలంలో సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ దూకుడైన ఆటతో మోతమోగిస్తున్న ఇంగ్లండ్ 'బజ్‌బాల్' గేమ్‌కు.. టీమ్‌ఇండియా 'విరాట్ బాల్' సరైన కౌంటర్ అని క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ అన్నాడు. భారత్, ఇంగ్లండ్ మధ్య గురువారం నుంచి ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది. 'ప్రస్తుతం కోహ్లీ మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఇంగ్లండ్ బజ్‌బాల్‌కు సమాధానమిచ్చేందుకు మన దగ్గర 'విరాట్‌బాల్' ఉంది. సుదీర్ఘ ఫార్మాట్‌ను ఎంతగానో ఇష్టపడే కోహ్లీ.. టెస్టుల్లో అర్ధశతకాల కంటే.. శతకాలే ఎక్కువ చేశాడు' అని సన్నీ అన్నాడు.

# తమిళ్ తలైవాస్ ఐదో విజయం



హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రొ కబడ్డీ లీగ్‌లో తమిళ్ తలైవాస్ ఐదో విజయం నమోదు చేసుకుంది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో తలైవాస్ 45-28తో బెంగళూరు బుల్స్‌పై విజయం సాధించింది. తలైవాస్ తరపున నరేందర్ 14 పాయింట్లతో సత్తాచాటితే.. అజింక్యా పవార్ 11 పాయింట్లు సాధించి విజయంలో కీలక పాత్ర పోషించాడు. తలైవాస్ కెప్టెన్ సాగర్ డిఫెన్స్‌లో రాణించి ఐదు ట్యాకిల్ పాయింట్లు ఖాతాలో వేసుకున్నాడు. బెంగళూరు తరపున అక్షిత్ 12 పాయింట్లతో ఒంటరి పోరాటం చేయగా.. అతడికి సహచరుల నుంచి సరైన సహకారం లభించలేదు. మరో మ్యాచ్‌లో పుణెరీ పల్టన్ 34-21తో గుజరాత్ జెయింట్స్‌పై విజయం సాధించింది. జైపూర్ పింక్ పాంథర్స్ 58 పాయింట్లతో పట్టిక అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. పుణెరీ పల్టన్ 57 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది.

# పాకిస్థాన్ ఓదార్పు విజయం



క్రైస్ట్‌చర్చ్: తొలి నాలుగు మ్యాచ్‌ల్లో కనీస ప్రతిఘటన కనబర్చలేక సిరీస్ కోల్పోయిన పాకిస్థాన్.. న్యూజిలాండ్‌తో జరిగిన ఆఖరి మ్యాచ్‌లో ఓదార్పు విజయం సాధించింది. ఆదివారం జరిగిన ఐదో టీ20లో పాకిస్థాన్ 42 పరుగుల తేడాతో కివీస్‌ను ఓడించి వైట్‌వాష్ నుంచి బయటపడింది. మొదట పాక్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసింది. రిజ్వాన్ (38) టాప్ స్కోరర్. కివీస్ బౌలర్లలో సౌథీ, హెన్రీ, ఫెర్గూసన్, సోధి తలా రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో న్యూజిలాండ్ 17.2 ఓవర్లలో 92 పరుగులకు ఆలౌటైంది. ఫిలిప్స్ (26) టాప్ స్కోరర్. పాక్ బౌలర్లలో ఇఫ్తికార్ 3, కెప్టెన్ షాహీన్ అఫ్రిది నవాజ్ చెరో 2 వికెట్లు తీశారు.


# భద్రం.. బీ కేర్‌ఫుల్

## క్రెడిట్ కార్డు వాడకంలో అలసత్వం తగదు

*క్రెడిట్ కార్డుల వినియోగం విపరీతంగా పెరిగిపోతున్న రోజులివి.*

**చాలామంది దగ్గర ఒకటికి మించే ఉన్నాయన్నా అతిశయోక్తి కాదు. అంతలా వాటిని వాడేస్తున్నాం మరి.**

*అయితే తెలిసి వినియోగిస్తే ఈ క్రెడిట్ కార్డులతో ఎంత లాభమో.. తెలియకుండా ముందుకెళ్తే అంతే నష్టాలుంటాయన్నది మీకు తెలుసా..*



దేశంలో ప్రస్తుతం సుమారు 10 కోట్ల క్రెడిట్ కార్డులు చలామణిలో ఉన్నాయని అంచనా. ఏడాది క్రితంతో పోల్చితే 17 శాతం పెరిగాయని గణాంకాలనుబట్టి తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో క్రెడిట్ కార్డుల వినియోగంలో కొన్ని ముఖ్యాంశాలను ఇక్కడ ప్రస్తావించుకోవాల్సి వస్తున్నది. ఎంత తెలివిగా కార్డు వాడుకుంటామో అంత ప్రయోజనం ఉంటుంది. ఏ చిన్న అప్పు మిగిలిపోయినా అది కొండలా మారి మన నెత్తినే బండేస్తుంది.

**రూ.60 బకాయికి రూ.6వేల పెనాల్టీ!**

ఆమధ్య సోషల్ మీడియాలో ఓ కస్టమర్‌కు క్రెడిట్ కార్డ్ సంస్థ వేసిన పెనాల్టీ వైరల్‌గా మారింది. రూ.1,51,460కి క్రెడిట్ కార్డ్ బిల్ వస్తే అందులో సదరు కస్టమర్.. పొరపాటున రూ.1,51,400 మాత్రమే చెల్లించాడు. మిగిలిన రూ.60 పెండింగ్‌లో పడింది. దీంతో తర్వాతి నెలలో అతనికి పెనాల్టీ, ఇంట్రెస్ట్, లేట్ ఫీజులవంటివన్నీ కలిపి రూ.6,349 బిల్లు వచ్చింది. అందుకే క్రెడిట్ కార్డ్ వినియోగంలో ఏ చిన్న అలసత్వం వహించినా భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి ఉంటుంది. అదే బ్యాంకుల పాలిట వరం కూడా. ఎందుకంటే ఇలాంటి తప్పులే వాళ్లకు లాభాలను తెచ్చిపెడతాయి. లేకపోతే మనకు ఫ్రీగా 20-50 రోజుల క్రెడిట్ లిమిట్ ఇవ్వడం వల్ల వాళ్లకు అంతగా వచ్చే ప్రయోజనం ఏంటో ఆలోచించండి.

**మినిమం డ్యూ పే చేస్తే చాలా?**

మనలో చాలామంది క్రెడిట్ కార్డు బిల్లులో మినిమం డ్యూ చెల్లించి బండి నడిపిస్తారు. బకాయిలో ఉన్న మొత్తంలో 5 శాతం చెల్లిస్తే సరిపోయే ఈ మినిమం డ్యూలో ఓ లొసుగును తప్పక గుర్తించాలి. అదే అప్పటిదాకా ఉన్న పెండింగ్ అమౌంట్‌పై వడ్డీని వసూలు చేయడంతోపాటు తర్వాతి బిల్లింగ్ సైకిల్‌లో ఉన్న అన్‌బిల్ ట్రాన్జాక్షన్స్‌కు కూడా అదేరోజు నుంచి వడ్డీని లెక్కించడం అన్నది. అంటే ఇది డబుల్ ధమాకా. పాత పెండింగ్‌పై వడ్డీ, పెనాల్టీతో పాటు కొత్త సైకిల్ ట్రాన్జాక్షన్స్‌పై కూడా పోటు పడుతుంది.

**డేటు దాటితే.. గోస పడ్తం**

క్రెడిట్ కార్డు వినియోగంలో ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సింది డ్యూ డేట్. ఇది చాలా ముఖ్యమైనది. ఈ తేదీలోపు మనం పూర్తిగా పెండింగ్ అమౌంట్ కడితేనే తర్వాతి 50 రోజుల ఇంట్రెస్ట్ ఫ్రీ ట్రాన్జాక్షన్స్‌కు అర్హత సంపాదిస్తాం. అలా కాకుండా మినిమం పే చేస్తే మాత్రం చాలా భారాన్ని మోయాల్సి ఉంటుంది. బ్యాంకులు ఫైనాన్స్ చార్జీల పేరుతో మనం వస్తువులు కొన్న రోజు నుంచే వడ్డీని వసూలు చేయడం మొదలుపెడతాయి. అంటే ఇక్కడ ఆ వడ్డీరహిత సౌలభ్యాన్ని (ఇంట్రెస్ట్ ఫ్రీ గ్రేస్ పీరియడ్) మనం కోల్పోతున్నామని అర్థం చేసుకోవాలి.

**సిబిల్ స్కోర్ కూడా ఔట్**

క్రెడిట్ కార్డు మొత్తం బకాయిలో మినిమం అమౌంట్ పే చేయడం వల్ల మన పేరు క్రెడిట్ బ్యూరోకి వెళ్లకుండా తాత్కాలికంగా ఆగుతుంది. అయితే ఆ కనీస సొమ్ము కూడా చెల్లించకపోతే మాత్రం మన సిబిల్ హిస్టరీ డిఫాల్ట్ జాబితాలోకి ఎక్కి మన క్రెడిట్ స్కోర్‌పై నెగిటివ్ ఎఫెక్ట్ చూపిస్తుంది. అప్పుడు చక్రవడ్డీ, భూచక్ర వడ్డీలను ఎదుర్కోవాల్సి వస్తుంది. కనుక క్రెడిట్ కార్డు వినియోగదారులు ఎప్పటికప్పుడు పూర్తి బిల్లులను చెల్లించడమే లాభదాయకం. అప్పుడే మనకు ప్రోత్సాహకాలూ ఆయా సంస్థల నుంచి వస్తాయి.

**-నాగేంద్రసాయి కుందవరం**



## వడ్డీ భారం.. తడిసి మోపెడు

***రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఎంత చెప్పినా బ్యాంకులు మాత్రం రూ.100కు నాలుగైదు రూపాయల వడ్డీని ముక్కు పిండి వసూలు చేస్తున్నాయి. ఇక పెనాల్టీ, సర్వీస్ చార్జ్, జీఎస్టీ వంటివి బోనస్. అందుకే మన శాలరీలో గరిష్ఠంగా 50 శాతానికి మించకుండా, అది కూడా అత్యవసర పరిస్థితుల్లోనే క్రెడిట్ కార్డును వాడటం మంచిది. అలాగే కచ్చితమైన ప్రణాళిక పెట్టుకుని, యాభై రోజుల క్రెడిట్ సైకిల్‌లోపే అప్పును తీర్చేస్తే మంచిది. లేకపోతే అతి భారీ వడ్డీ మన జీవితాలను అతలాకుతలం చేస్తుంది.***


# రాబడి

# వడ్డీరేట్లు మారాయ్

### జనవరి నుంచే అమల్లోకి

బ్యాంకులు వాటి మార్జినల్ కాస్ట్ బేస్డ్ లెండింగ్ రేట్స్ (ఎంసీఎల్‌ఆర్) ఆధారంగా రుణ వడ్డీరేట్లను నిర్ణయిస్తుంటాయి. గృహ, ఆటో, వ్యక్తిగత రుణాలను ప్రభావితం చేసే ఎంసీఎల్‌ఆర్‌ను ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, బీవోబీ తదితర కొన్ని బ్యాంకులు ఈ నెలలో సవరించాయి. ఆ వివరాలివే..

**ఐసీఐసీఐ బ్యాంక్:** 10 బేసిస్ పాయింట్ల మేర పెంచింది. బ్యాంక్ వెబ్‌సైట్ ప్రకారం ఓవర్‌నైట్ ఎంసీఎల్‌ఆర్, ఒక నెల, 6 నెలల రేట్లు 8.6 శాతానికి, 3 నెలలది 8.65 శాతానికి, ఏడాది రేటు 8.7 శాతానికి పెరిగాయి.



**బీవోఐ :** ఎంసీఎల్‌ఆర్‌ను 5 బేసిస్ పాయింట్ల మేర పెంచినట్టు బ్యాంక్ ఆఫ్ ఇండి యా (బీవోఐ) వెబ్‌సైట్ వెల్లడిస్తున్నది. ఓవర్‌నైట్ రేటు 8 శాతానికి చేరగా, ఒక నెల రేటు 8.25 శాతం, 6 నెలల రేటు 8.6 శాతం, ఏడాది రేటు 8.8 శాతంగా ఉన్నాయి.

**బ్యాంక్ ఆఫ్ బరోడా:** ఓవర్‌నైట్ ఎంసీఎల్‌ఆర్ 8 శాతం నుంచి 8.05 శాతానికి పెరగ్గా, కొన్ని కాల పరిమితులకు మార్పులేవీ చేయలేదు. ఒక నెలది 8.3 శాతం, 3 నెలలది 8.4 శాతంగా ఉన్నాయి.6 నెలలది 8.6 శాతానికి, ఏడాది ఎంసీఎల్ ఆర్ 8.8 శాతానికి పెరిగింది.

**కెనరా బ్యాంక్:** 5 బేసిస్ పాయింట్ల మేర పెరిగాయి. ఓవర్‌నైట్ ఎంసీఎల్‌ఆర్ 8.05 శాతానికి, నెలది 8.15 శాతానికి, 3 నెలలది 8.25 శాతానికి, 6 నెలలది 8.6 శాతానికి, ఏడాదిది 8.8 శాతానికి, రెండేండ్లది 9.1 శాతానికి, మూడేండ్లది 9.2 శాతానికి పెరిగాయి. రెపో లింక్డ్ లెండింగ్ రేటు (ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్) 9.25 శాతం.

**హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్:** తాజా ఎంసీఎల్ ఆర్ 8.8 శాతం-9.3 శాతం శ్రేణిలో ఉన్నది. ఓవర్‌నైట్ ఎంసీఎల్‌ఆర్ 10 బేసిస్ పాయింట్లు పెరిగి 8.8 శాతానికి చేరింది. నెల రోజులది 5 బేసిస్ పాయింట్ల పెరుగుదలతో 8.8 శాతానికి, మూడు నెలలది 8.95 శాతానికి, 6 నెలలది 9.2 శాతానికి పెరిగాయి. పలు వినియోగ రుణాలకు అనుసంధానించే ఏడాది ఎంసీఎల్‌ఆర్ 9.25 శాతానికి చేరింది.

**ఐడీబీఐ బ్యాంక్:** ఓవర్‌నైట్ ఎంసీఎల్ ఆర్ 8.3 శాతంగా, నెల రేటు 8.45 శాతంగా ఉన్నాయి. 3 నెలలది 8.75 శాతం, 6 నెలలది 8.95 శాతం, ఏడాది రేటు 9 శాతంగా ఉన్నాయి. రెండేండ్లది 9.55 శాతం, మూడేండ్లది 9.95 శాతం.

**యెస్ బ్యాంక్:** ఈ బ్యాంక్ వెబ్‌సైట్‌లో ఉంచిన సమాచారం మేరకు ఎంసీఎల్‌ఆర్ ఓవర్‌నైట్ రేటు 9.2 శాతంగా ఉన్నది. అలాగే ఒక నెల రేటు 9.45 శాతం, 3 నెలల రేటు 10 శాతం, 6 నెలల రేటు 10.25 శాతం, ఒక ఏడాది రేటు 10.50 శాతంగా ఉన్నాయి.



# ఒడిదొడుకుల బాట

మార్కెట్ పల్స్

**ఆరు** రోజుల ట్రేడింగ్‌తో ముగిసిన గత వారం ప్రథమార్ధంలో ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 22,124 పాయింట్ల కొత్త రికార్డు స్థాయిని చేరినంతనే, హఠాత్ పతనాన్ని చవిచూసి 21,286 పాయింట్ల కనిష్ఠ స్థాయిని తాకింది. తిరిగి కోలుకున్నా.. 309 పాయింట్లు క్షీణించి 21,572 పాయింట్ల వద్ద క్లోజయ్యింది. రెలిటివ్ స్ట్రెంత్ ఇండెక్స్ (ఆర్‌ఎస్‌ఐ) బేరిష్ డైవెర్జెన్స్ ప్రదర్శిస్తున్నదని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రీసెర్చ్ హెడ్ నాగరాజ షెట్టి తెలిపారు. అయితే మూడు రోజుల ట్రేడింగ్‌కే పరిమితం కానున్న ఈ వారంలో జనవరి డెరివేటివ్ కాంట్రాక్టులు కూడా ముగియనున్నందున నిఫ్టీ ఒడిదుడుకులకు లోనవుతుందని అంచనా. కార్పొరేట్ ఫలితాలకు అనుగుణంగా హెచ్చుతగ్గుల తీవ్రత పెరగవచ్చని, హైబేటా స్టాక్స్‌లో పొజిషన్లను చెక్ చేసుకోవాలని రెలిగేర్ బ్రోకింగ్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా ఇన్వెస్టర్లకు సూచించారు.

**మద్దతు 21,500-నిరోధం 21,800**

పుట్ రైటింగ్ భారీగా జరిగిన 21,500 పాయింట్ల వద్ద నిఫ్టీకి ఈ వారం కీలక మద్దతు ఉన్నదని, ఈ స్థాయి నుంచి రైటర్లు వైదొలిగితే 21,000 పాయింట్ల వరకూ తగ్గవచ్చని సామ్కో సెక్యూరిటీస్ సీఈవో జిమిత్ మోదీ అంచనా వేశారు. 21,700, 21,800 వద్ద షార్ట్ కవరింగ్ జరిగితే పెరగవచ్చన్నారు. ఈ వారం 21,300 పాయింట్ల సమీపంలో మద్దతు పొందవచ్చని, 21,750-21,850 స్థాయిలు అవరోధం కల్గించవచ్చని షెట్టి విశ్లేషించారు.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.